గోల్కొండ చౌరస్తాలో ఉచిత మజ్జిగ కేంద్రం ఏర్పాటు

చిక్కడపల్లి, మే 10 (ఆంధ్రజ్యోతి): గోల్కొండ చౌరస్తా సమీపంలో ఐబీ ఫ్లాట్స్ అపార్ట్‌మెంట్ వద్ద మజ్జిగ కేంద్రం ఏర్పాటు చేశారు. కేంద్రాన్ని అపార్ట్‌మెంట్‌వాసి నాగలక్ష్మి శుక్రవారం ప్రారంభించారు. బాటసారుల కోసం కొత్తిమీర, పుదీన కలిపిన మజ్జిగను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

చిక్కడపల్లి, మే 10 (ఆంధ్రజ్యోతి): మేధావులు మౌనం వీడి ఓటుహక్కును వినియోగించుకోవాలని కౌన్సెలింగ్ సైకోథెరపిస్ట్ పద్మాకమలాకర్ అన్నారు. అశోక్‌నగర్‌లో మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మనలను పాలించే నాయకుడిని ఎన్నుకునేందుకు తప్పకుండా ఓటు వేయాలన్నారు. యోగా గురువు సరోజిని తదితరులు పాల్గొన్నారు.

మేము చేసిన అభివృద్ధి చూసి ఓటేయండి

కాంగ్రెస్ పాలనలో ప్రజలకు అన్నీ కష్టాలే

- జడ్పీచైర్మన్‌గా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాను ఎంతో అభివృద్ధి చేశా
- ఎంపీగా గెలిపిస్తే బడుగు, బలహీనవర్గాలకు అండగా ఉంటా
- బీఆర్ఎస్ హయాంలో శివారు ప్రాంతాల అభివృద్ధి
- చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)



ముఖాముఖి

గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో జరిగిన అభివృద్ధి, అమలైన సంక్షేమ పథకాలను ఇపుడు ప్రజలు పదే పదే గుర్తుకు తెచ్చుకుంటున్నారని చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ పేర్కొన్నారు. అధికార కాంగ్రెస్ పాలనలో అన్ని విధాలా విఫలమైందని.. ఏ ఒక్క హామీ సరిగా నెరవేర్చలేదన్నారు. గతంలో తమ పార్టీ చేసిన అభివృద్ధిని చూసి ఓట్లేయాలని ఆయన ప్రజలను కోరుతున్నారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో విస్తృతంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న ఆయన గురువారం 'ఆంధ్రజ్యోతి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలపై మాట్లాడారు. గతంలో తాను జడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్సీగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఎన్నో అభివృద్ధి పనులు చేశానని.. ఈ ఎన్నికల్లో ఎంపీగా గెలిపిస్తే ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తానన్నారు. ఇంటర్వ్యూలో ఆయన ఏమన్నారంటే..

కాంగ్రెస్ చేసిందేమీ లేదు

చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు మా వైపే ఉన్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఈ రాష్ట్ర ప్రజలకు ఇప్పటి వరకు చేసిందేమీ లేదు. పేరుకే గ్యారెంటీలు కానీ ఒక్కదాన్నీ ఇప్పటి వరకు నెరవేర్చలేదు. అందుకే ప్రజలు కూడా విసిగిపోయారు. ఎక్కడకు వెళ్లినా బీఆర్ఎస్ పాలనే బాగుందంటున్నారు. ఇచ్చిన హామీలు నెరవర్చేని కాంగ్రెస్ మళ్లీ ప్రజలను ఓటు అడిగే హక్కును కోల్పోయింది. రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. కరెంట్, నీళ్ల కోసం జనం అల్లాడుతున్నారు. పట్టణ ప్రాంతాల్లో పరిస్థితి మరింత ఘోరంగా ఉంది. నగర, శివారు ప్రాంతాల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజలు తాగునీటి కోసం విలవిల్లాడుతున్నారు. రుణమాఫీ లేదు... రైతుబంధు లేదు... ఆడపిల్లలకు తులం బంగారం పథకం ఎక్కడకు పోయిందో తెలియదు. అధికార పార్టీ నేతల అబద్దాలు, శుష్క వాగ్దానాలను ప్రజలు అర్థం చేసుకున్నారు. బీజేపీ కూడా ప్రజల మధ్య చిచ్చుపెట్టి రాజకీయం నడపాలని చూస్తోంది. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీజేపీ ఈ ప్రాంతానికి ఏ ఒక్క మంచి పనీ చేయలేదు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా చుట్టూ కొన్ని లక్షల మందికి ఉపాధి కల్పించేందుకు తీసుకువచ్చిన ఐటీఐఆర్ ప్రాజెక్టును గంగలో కలిపారు. రాష్ట్రం కోసం ఒక్క ప్రాజెక్టునూ బీజేపీ నేతలు తీసుకురాలేకపోయారు. అందుకే ప్రజలు కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పేందుకు సిద్ధమవుతున్నారు.

బడుగులకు బాసటగా ఉంటా...

చేవెళ్ల పార్లమెంట్ స్థానంలో పోటీ చేసేందుకు అవకాశం కల్పించిన పార్టీ అధినేత కేసీఆర్‌కు రుణపడి ఉంటాను. అతిపెద్ద నియోజకవర్గాల్లో ఒక్కటైన చేవెళ్ల పార్లమెంట్ స్థానం నుంచి వెనుకబడిన వర్గానికి చెందిన నాకు పోటీ చేసే అవకాశం కల్పించారు. మాజీ మంత్రి కేటీఆర్, సబితారెడ్డి సహకారంతో పాటు ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ ముఖ్యనేతల సహకారంతో ఈ ఎన్నికల్లో విజయం సాధించబోతున్నాం. గత బీఆర్ఎస్ పాలనలో చేసిన అభివృద్ధి పనులే నన్ను గెలిపించబోతున్నాయి. ప్రతిష్ఠాత్మకమైన చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో నన్ను గెలిపిస్తే బడుగులకు బాసటగా ఉంటాను. నా జీవితమంతా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికే పాటుపడ్డాను. అణగారిన వర్గాల కోసం ఇంకా చేయాల్సింది ఎంతో ఉంది. నాకు ఇక్కడ నుంచి ఎంపీగా అవకాశం కల్పిస్తే ఈ ప్రాంత ప్రజలకు మరింత సేవ చేస్తాను. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అభివృద్ధి కోసం ఎంతో కాలం పనిచేశాను. ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఈ ప్రాంతంలో రోడ్లు, స్కూళ్లు నిర్మించడంతో పాటు తాగునీటి పథకాలను దాదాపు అన్ని గ్రామాల్లో అమలు చేసేందుకు కృషి చేశాను. నేను ఈ ప్రాంతం వాడిని. ఈ ప్రాంత ప్రజలకు కొన్ని దశాబ్దాల అనుబంధం ఉంది. మిగతా అభ్యర్థులను కూడా బేరీజు వేసుకుని ఎన్నికల్లో ఓటు వేయండి. ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు చూపుతున్న ఆదరాభిమానాలు అంతా ఇంతా కాదు. ప్రచారానికి ఎక్కడకు వెళ్లినా ప్రజలంతా ఉత్సాహంతో సభలకు వస్తున్నారు.

111 జీవో సమస్యను శాశ్వతంగా పరిష్కరించాం

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ శివార్లలో రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు పెద్ద ఎత్తున కల్పించాం. కేటీఆర్ కృషితో ఎన్నో అంతర్జాతీయ కంపెనీలు ఇక్కడ కొలువుదీరాయి. ఇందువల్ల లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు వచ్చాయి. అలాగే హిమాయత్‌సాగర్ పరీవాహక ప్రాంతంలో అమల్లో ఉన్న 111జీవో వల్ల స్థానికంగా 83 ప్రాంతాల ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. హైదరాబాద్‌కు ఆనుకుని ఉన్న ఈ ప్రాంతాలు ఈ జీవో వల్ల అభివృద్ధికి నోచుకోకపోవడంతో మా ప్రభుత్వం ఈ జీవోను రద్దు చేసింది. గతంలో ఈ ప్రాంత ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఈ జీవోను రద్దు చేయడంతో కొన్ని లక్షల మందికి ప్రయోజనం కలిగింది. ఈ ప్రాంతంలో భూములు ఉన్న రైతులు సంతోషపడ్డారు. ఇక ఉమ్మడి జిల్లాకు తాగు, సాగునీటిని అందించేందుకు రూపుదిద్దిన పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు బీఆర్ఎస్ హయాంలోనే ప్రారంభమయ్యాయి. ఐటీ పార్కులు, ఇండస్ట్రియల్ పార్కులు, ఎన్నో ఏర్పాటు చేసి పారిశ్రామికంగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్లాం. ఇలా బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఎన్నో ఉన్నాయి. వీటన్నింటినీ చూసి ఓటు వేయాలని ప్రజలను కోరుతున్నాను.

కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి

- బ్రాహ్మణ సంఘాల నేతల పిలుపు

నల్లకుంట, మే 10 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో బ్రాహ్మణులంతా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని పలు బ్రాహ్మణ సంఘాల నేతలు పిలుపునిచ్చారు. శుక్రవారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆలిండియా బ్రాహ్మణ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి తులసీ శ్రీనివాస్, కార్యవర్గ సభ్యుడు నైషధం సత్యనారాయణమూర్తి, శ్రీవైష్ణవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. పి. చారి, నాయకులు రత్నమాచార్యులు, వారణాసి వంశీ మాట్లాడారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బ్రాహ్మణులకు రాజకీయ ప్రాధాన్యత లభిస్తుందన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో 20 లక్షల మంది బ్రాహ్మణుల జనాభా ఉందని, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థులను గెలిపిస్తే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో 10 సీట్లలో బ్రాహ్మణులు పోటీ చేసే అవకాశం ఉంటుందన్నారు. బ్రాహ్మణ పరిషత్‌కు రూ. 150 కోట్లు మంజూరు చేయడంతోపాటు బ్రాహ్మణుల సమస్యలను పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు.



మాట్లాడుతున్న ఆలిండియా బ్రాహ్మణ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి తులసీ శ్రీనివాస్, నైషధం సత్యనారాయణమూర్తి తదితరులు

కాంగ్రెస్‌కు మాదిగల మద్దతు

నల్లకుంట, మే 10 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల తర్వాత మాదిగలకు జనాభా దామాషా ప్రకారం న్యాయం చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చిన నేపథ్యంలో మాదిగ జాతి కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తున్నట్లు మాదిగలు, మాదిగ ఉప కులాల ఐక్యవేదిక నేతలు పేర్కొన్నారు. ఎంపీ ఎన్నికల్లో మాదిగలకు అనివార్య కారణాలతో సీట్ల కేటాయింపులో న్యాయం జరగలేదని, భవిష్యత్‌లో పునరావృతం కాకుండా చూస్తామని సీఎం హామీ ఇచ్చారని వారన్నారు. శుక్రవారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ మాదిగలు, మాదిగ ఉప కులాల ఐక్యవేదిక నేతలు రేణుకుంట్ల ఎల్లయ్య మాదిగ (దళిత హక్కుల పోరాట సమితి), భైరి వెంకటేశం (మాదిగ ఉప కులాలు), తూర్పాటి హనుమంతు (బుడగ జంగాల జేఏసీ), శ్రీరాములు, యాక స్వామి మాదిగ, గడిపె నాగయ్య మాదిగ, కీసర మురళీ మాదిగ తదితరులు మాట్లాడారు. మాదిగలకు మంత్రి పదవి, రాజ్యసభ, ఎమ్మెల్సీ, కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారన్నారు.



మాట్లాడుతున్న రేణుకుంట్ల ఎల్లయ్య

'రవీంద్రుని సందేశం విశ్వశాంతి మానవత్వం'

చిక్కడపల్లి, మే 10 (ఆంధ్రజ్యోతి): రవీంద్రుని సందేశం విశ్వశాంతి మానవత్వం అని ప్రముఖులు పేర్కొన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి శతాబ్దిపూర్వ మహనీయుల కార్యక్రమంలో భాగంగా రవీంద్రనాథ్‌ఠాగూర్ సంస్మరణ సమావేశం జరిగింది. సాహితీకిరణం పత్రిక సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు మాట్లాడుతూ.. ప్రపంచ శాంతి సోదరభావం మానవత్వం రవీంద్రుని సందేశం అన్నారు. గాయకుడు టీవీ రావు మాట్లాడుతూ.. ఠాగూర్ గీతాంజలి కవితా సంపుటి పలు భాషల్లో అనువాదం పొంది ప్రపంచ సాహిత్యంలో గుర్తింపు పొందిందన్నారు. గానసభ అధ్యక్షుడు కళాజనార్దనమూర్తి మాట్లాడుతూ.. శతాబ్దిపూర్వ అనంతర కాల మహనీయుల జయంతి కార్యక్రమాలను క్రమం తప్పకుండా కొనసాగిస్తామన్నారు. గానసభ పాలకమండలి సభ్యురాలు భమిడిపాటి ఉష తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్, బీజేపీకి ఓటు ద్వారా బుద్ధి చెప్పండి'

రాంనగర్, మే 10 (ఆంధ్రజ్యోతి): మాదిగలను మోసం చేసిన కాంగ్రెస్, మనువాద పార్టీ బీజేపీకి ఓటుద్వారా బుద్ధి చెప్పాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం విద్యానగర్‌లో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

బ్రాహ్మణ హాస్టల్‌లో పరశురామ జయంతి

రాంనగర్, మే 10 (ఆంధ్రజ్యోతి): నల్లకుంటలో బ్రాహ్మణ హాస్టల్‌లో శుక్రవారం పరశురామ జయంతి కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మాజీ అధ్యక్షుడు పొన్నాడ సుబ్రహ్మణ్యప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని పరశురామ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కరణం సురేష్, సిరిపోలు మురళి, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.



మాజీ కార్పొరేటర్ వనం రమేష్ ఆధ్వర్యంలో ఎల్‌బీ స్టేడియంలో ప్రధాని మోదీ సభకు ద్విచక్రవాహనాలపై ర్యాలీగా వెళ్తున్న బీజేపీ నేతలు

- నల్లకుంట, ఆంధ్రజ్యోతి

చిన్నారి పాటకు స్పందించిన మోదీ

- రీట్వీట్ చేసిన కాపీపై ఆటోగ్రాఫ్

రాంనగర్, మే 10 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బండారు విజయలక్ష్మి కుమార్తె జశోధర 2023 డిసెంబర్ 9న దత్తాత్రేయ ఇంట్లో జరిగిన ఓ శుభకార్యంలో పాటపాడింది. ఈ పాటను దత్తాత్రేయ మోదీకి అదే రోజు ట్వీట్ చేశారు. మరుసటి రోజు చిన్నారిని పొగుడుతూ మోదీ రీట్వీట్ చేశారు. రీట్వీట్ చేసిన కాపీని శుక్రవారం ఎల్‌బీ స్టేడియంలో జరిగిన బహిరంగ సభలో మోదీకి విజయలక్ష్మి చూపించి దానిపై ఆటోగ్రాఫ్ తీసుకున్నారు. జశోధర పాడిన పాటను తాను విన్నానని, ఆమెకు తన ఆశీస్సులు అని మోదీ తెలియజేసినట్లు విజయలక్ష్మి పేర్కొన్నారు. తాను రీట్వీట్‌ను మోదీకి చూపించగానే తనకు గుర్తుందని చెప్పడం ఎంతో సంతోషం కలిగిందన్నారు.



రీట్వీట్ చేసిన కాపీపై మోదీ ఆటోగ్రాఫ్ తీసుకుంటున్న విజయలక్ష్మి

గుర్తింపుకార్డులు లేని వారిని అనుమతించొద్దు

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్ సిటీ, మే 10 (ఆంధ్రజ్యోతి): గుర్తింపుకార్డులు లేని ఓటర్లను పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించవద్దని హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కార్వాన్, బహదూర్‌పురా అసెంబ్లీ సెగ్మెంట్లలోని పోలింగ్ కేంద్రాలను, నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్, చార్మినార్ డీఆర్సీ సెంటర్లలో ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కేంద్రాల్లో పోలింగ్ ముందురోజు సిబ్బంది ఉండేందుకు గదులను, పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. శనివారం సాయంత్రం 5 గంటల తర్వాత పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ పూర్తయిన వెంటనే బాక్స్‌లను, హోమ్ ఓటింగ్‌కు సంబంధించిన బ్యాలెట్ బాక్స్‌లను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచాలని సూచించారు.

బడుగు, బలహీన వర్గాలకు కాంగ్రెస్‌తోనే న్యాయం

సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్

ముషీరాబాద్, మే 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. శుక్రవారం ముషీరాబాద్‌లో అందారా హాల్‌లో పద్మశాలి ఆత్మీయ సమ్మేళన సభ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సుదేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న దానం మాట్లాడుతూ.. కిషన్‌రెడ్డి సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి చేసిందేమీ లేదని విమర్శించారు. ఆయన చేసిన అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాయిని నర్సింహారెడ్డికి కేసీఆర్ అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం, మంత్రి పదవి నుంచి తొలగించడంతో మనోవేదనకు గురై మృతి చెందారని పేర్కొన్నారు. నాయిని మృతికి కేసీఆర్ బాధ్యుడన్నారు. పద్మశాలీలకు భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. హస్తం గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీలు అంజన్‌కుమార్ యాదవ్, అజారుద్దీన్, యువజన కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి అరవిందుకుమార్ యాదవ్, పద్మశాలి సంఘం నాయకులు సంగిశెట్టి జగదీశ్వర్‌రావు, చంద్రమౌళి, సుభాష్, గుర్రం శంకర్, బోనం ఊర్మిళ, ఆర్‌ఎల్ రమేష్ పాల్గొన్నారు.



పద్మశాలి ఆత్మీయ సమ్మేళన సభలో మాట్లాడుతున్న దానం నాగేందర్

కాంగ్రెస్‌కు ఓటు వేయండి

కవాడిగూడ: ముగ్గుబస్తీకి చెందిన వైఎస్ఆర్‌టీపీ ముషీరాబాద్ నియోజకవర్గం మాజీ కో-ఆర్డినేటర్, కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు ఆకుల ప్రవీణ్ దానం నాగేందర్‌ను శుక్రవారం కలిశారు. కాంగ్రెస్ పార్టీ ఏపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ విజయానికి తమవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

దానంను గెలిపించాలి

రాంనగర్: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌ను గెలిపించాలని టీపీసీసీ రాష్ట్ర మాజీ చైర్మన్ జీబీ శ్యామ్‌రావు కోరారు. శుక్రవారం పద్మాకాలనీ, లలితానగర్, నల్లకుంట మార్కెట్, ఫీవర్ ఆస్పత్రి ప్రాంతంలో ప్రచారం నిర్వహించారు.

సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ జెండా ఎగరడం కాయం

బర్కత్‌పుర: సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ఆ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్ ధీమా వ్యక్తం చేశారు. అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తొలుపునూరి కృష్ణగౌడ్



దానం నాగేందర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు

సారథ్యంలో పలువురు నాయకులు దానంను శుక్రవారం కలిసి ఎన్నికల ప్రచార సరళిని వివరించారు. దానం మాట్లాడుతూ.. అంబర్‌పేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి 50 వేల మెజారిటీ వస్తుందని ఆకాంక్షించారు.

బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరిక

నల్లకుంట: బీఆర్‌ఎస్ గోల్నాక డివిజన్ అధ్యక్షుడు కత్తుల సుదర్శన్‌రావు, నల్లకుంట డివిజన్ మాజీ అధ్యక్షుడు బి. ధన్‌రాజ్‌యాదవ్, టీడీపీ బర్కత్‌పుర డివిజన్ మాజీ అధ్యక్షుడు కుర్మ భిక్షపతి వారి అనుచరులతో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కేపీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి దానం కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

సబర్మతినగర్‌లో నాయకుల ప్రచారం

చిక్కడపల్లి: దానం నాగేందర్‌కు మద్దతుగా సబర్మతినగర్ బస్తీలో గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. అరవింద్‌కుమార్ యాదవ్, కాంగ్రెస్ నగర ఉపాధ్యక్షుడు గ్రురం శంకర్ సుబాని మసీదు వద్ద ముస్లింలను కలిసి కాంగ్రెస్‌కు ఓటు వేయాలని కోరారు.





దానం నాగేందర్‌ను కలిసిన ఆకుల ప్రవీణ్, కృష్ణగౌడ్ తదితరులు

ముషీరాబాద్ కాంగ్రెస్ అడ్డా : అంజన్‌కుమార్ యాదవ్

ముషీరాబాద్, మే 10 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ కాంగ్రెస్ అడ్డా అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ అన్నారు. శుక్రవారం ముషీరాబాద్‌లో గంగపుత్ర ఆత్మీయ సమ్మేళన సభ ఆలిండియా కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ కార్యదర్శి బిజ్జి శత్రు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ సరితాగోవింద్ భర్త బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు జి. గోవింద్ ఆధ్వర్యంలో వందమంది బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. అంజన్‌కుమార్ యాదవ్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గోవింద్ మాట్లాడుతూ.. దానం నాగేందర్ గెలుపునకు గంగపుత్రులంతా ఐక్యంగా కృషిచేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు పెండం శ్రీనివాస్‌యాదవ్, బి-బ్లాక్ ఉపాధ్యక్షుడు పట్నం నాగభూషణం గౌడ్, సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగాల శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



అంజన్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు గోవింద్ తదితరులు



రసాయనాలతో పండించిన మామిడి పండ్లను చూపిస్తున్న వినియోగదారుల హక్కుల సంస్థ ప్రతినిధులు

రసాయనాలతో మగ్గించిన మామిడి పండ్లు స్వాధీనం

- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న వినియోగదారుల హక్కుల సంస్థ ప్రతినిధులు
- నాలాలో పారేసిన పోలీసులు

కవాడిగూడ, మే 10 (ఆంధ్రజ్యోతి): రసాయనాలతో పండించి విక్రయిస్తున్న మామిడి పండ్లను వినియోగదారుల హక్కుల సంస్థ ప్రతినిధులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రసాయనాలతో మగ్గించిన మామిడి పండ్లను విక్రయిస్తున్నారని రామగిరి హరిబాబు వినియోగదారుల హక్కుల సంస్థలో ఇటీవల ఫిర్యాదు చేశాడు. శుక్రవారం వినియోగదారుల హక్కుల సంస్థ సభ్యులు ఇందిరా పార్కు వద్ద మామిడి పండ్లు విక్రయిస్తున్న వ్యాపారి వద్దకు వెళ్లారు. ఆటో ట్రాలీలో డబ్బాల్లోగల మామిడి పండ్లలో కెమికల్ ప్యాకెట్లు పెడుతుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వ్యాపారిపై దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది వాటిని పరిశీలించారు. రసాయనాలతో పండించినవని తేలడంతో 200 కిలోల మామిడిపండ్లను వ్యాపారస్థుడి నుంచి స్వాధీనం చేసుకొని గాంధీనగర్ నాలాలో పారేశారు. కార్యక్రమంలో గుడవర్తి శివకుమార్, రవియాదవ్, రాజుయాదవ్, దుర్గాస్వామి, సత్తన్న పాల్గొన్నారు.

ఎంపీగా గెలిపించండి.. అండగా ఉంటా

బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్

ముషీరాబాద్, మే 10 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ఎంపీగా గెలిపిస్తే అండగా ఉంటానని బీఆర్‌ఎస్ అభ్యర్థి టి. పద్మారావుగౌడ్ అన్నారు. శుక్రవారం భోలక్‌పూర్‌లో బడీ మసీదు వద్ద ఎమ్మెల్యే ముఠాగోపాల్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు. ప్రార్థనలు ముగించుకొని మసీదు నుంచి బయటకు వచ్చిన ముస్లింలను కలిసి కారు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. ఈ సంధ్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ.. పేద ముస్లింలకు రిజర్వేషన్లు రద్దు చేస్తామని బీజేపీ అగ్రనాయకులు పేర్కొనడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు వై. శ్రీనివాస్‌రావు, మైనారిటీ కమిటీ నాయకుడు షరీఫ్, మీడియా సెల్ ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, మాజీ కార్పొరేటర్ వి. శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ముఠా జైసింహ, బింగి నవీన్ తదితరులు పాల్గొన్నారు.



ముషీరాబాద్ బడీ మసీదు వద్ద ప్రచారం నిర్వహిస్తున్న పద్మారావుగౌడ్, ఎమ్మెల్యే ముఠాగోపాల్

మైనారిటీల మద్దతు బీఆర్‌ఎస్‌కే

అంబర్‌పేట: మైనారిటీల మద్దతు బీఆర్‌ఎస్ అభ్యర్థి



అంబర్‌పేటలో ముస్లిం మైనారిటీల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

పద్మారావుగౌడ్‌కేనని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శుక్రవారం అంబర్‌పేటలో ముస్లిం మైనారిటీలతో ఎమ్మెల్యేతోపాటు మాజీ మంత్రి మహమూద్ అలీ, కార్పొరేటర్లు విజయ్‌కుమార్‌గౌడ్, బి. పద్మ సమావేశమయ్యారు. కారు గుర్తుకు ఓటేసి పద్మారావుగౌడ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో అంబర్‌పేట నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి దాసోజు శ్రావణ్, మాజీ కార్పొరేటర్లు కె.పద్మావతి, బి. వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పార్కుల్లో ప్రచారం

రాంనగర్/కవాడిగూడ: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌ను గెలిపించాలని కోరుతూ బీఆర్‌ఎస్ నాయకులు ముఠా జైసింహ, మాజీ కార్పొరేటర్ వి. శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఇందిరాపార్కు, సుందరయ్య పార్కులో శుక్రవారం ప్రచారం నిర్వహించారు.



కిషన్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు బాల్‌రాజ్‌గౌడ్, మోహన్



కమలం గుర్తుకు ఓటువేయాలని మహిళకు కరపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్

కిషన్‌రెడ్డికి మద్దతుగా టీడీపీ నాయకుల ప్రచారం

రాంనగర్, మే 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి జి. కిషన్‌రెడ్డిని గెలిపించాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ పలుసబాల్‌రాజ్‌గౌడ్ కోరారు. కిషన్‌రెడ్డికి మద్దతుగా టీడీపీ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు చంద్రమోహన్ గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం చిక్కడపల్లి, బృందావన్‌కాలనీ, సోప్ ఫ్యాక్టరీ లేన్ తదితర ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిఖర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమేష్, సాగర్, శివ, నాగేశ్వర్‌రావు తదతరులు పాల్గొన్నారు.

కమలం గుర్తుకు ఓటేయండి

చిక్కడపల్లి: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి మద్దతుగా కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ గాంధీనగర్ డివిజన్‌లో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి కరపత్రాలు పంచుతూ కమలం గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు.

'మహిళా శక్తికి తిరుగులేదు'

చిక్కడపల్లి, మే 10 (ఆంధ్రజ్యోతి): మహిళా శక్తికి ఏ రంగంలోనూ తిరుగు లేదని సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు అన్నారు. సుబ్బు మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో శ్రీధరం హైమవతి, రామయ్య సంస్మరణార్థం శుక్రవారం త్యాగరాయగాన సభలో నారీశక్తి పురస్కార ప్రదానసభ జరిగింది. నరసింహారావు, నటుడు ప్రదీప్, వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు గాయనీమణులు జ్యోతిర్మయి, సాయిసింధూర, శారదరాజా, స్వప్న, రజనిలకు నారీ శక్తి పురస్కారాలు బహూకరించారు. సంస్థ స్థాపకుడు రామసుబ్రహ్మణ్యం నిర్వహణలో సురేఖ, మధిర, భువనేశ్వరి, త్రినాథరావు అలనాటి, నేటి సినీ పాటలు గానం చేశారు. సంస్థ అధ్యక్షులు ప్రసన్న లక్ష్మి తదితరులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

ఆర్. కృష్ణయ్యపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

బర్కత్‌పుర/అంబర్‌పేట, మే 10 (ఆంధ్రజ్యోతి): ఏపీలో శ్రీకాళహస్తి నియోజకవర్గంలో రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్యపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. ఆయనపై జరిగిన దాడిని బీసీ సమాజంపై జరిగిన దాడిగా పరిగణిస్తున్నామని అన్నారు. శుక్రవారం కాచిగూడ అభినందన్ గ్రాండ్ హోటల్‌లో పలు బీసీ సంఘాల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ వ్యతిరేకుల్లారా ఖబర్దార్ అని హెచ్చరించారు. కృష్ణయ్యపై దాడి చేయించిన వ్యక్తిని ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. బహుజన వాదులంతా బీసీ వ్యతిరేకులకు ఓటు ద్వారా సమాధానం చెప్పాలని కోరారు. ఆర్. కృష్ణయ్యకు మరింత భద్రత ఏర్పాటు చేయాలని ఎలక్షన్ కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు సుధాకర్, సురేష్, మట్ట జయంతి గౌడ్, ఉదయ్‌నేత, నందగోపాల్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దాడి పిరికి చర్య

ఎంపీ ఆర్. కృష్ణయ్యపై దాడి పిరికి చర్య అని బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు గవ్వల భరత్‌కుమార్ అన్నారు. దాడికి పాల్పడిన ముఠాను వదిలేది లేదన్నారు. ఆర్. కృష్ణయ్యపై దాడికి నిరసనగా అంబర్‌పేట అలీకేఫ్ చౌరస్తాలో మహాత్మా జ్యోతిరావు ఫూలే విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు ప్రవీణ్ ముదిరాజ్, నాగరాజు, విశాల్, రాజ్‌కుమార్, నాగు, రోహిత్, లోకేష్, గిరిధర్, వినోద్, రాజేష్, లడ్డూసింగ్, కార్తీక్, మల్లికార్జున్, సందీప్, వికాష్, మనీష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాత్మా బసవేశ్వర జయంతి



ట్యాంక్‌బండ్‌పై బసవేశ్వర విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వీరశైవ లింగాయత్ సమాజ్ సభ్యులు, దైవజ్ఞశర్మ తదితరులు

కవాడిగూడ , మే 10 (ఆంధ్రజ్యోతి): సమసమాజ స్థాపన కోసం అనేక సంవత్సరాల క్రితమే మహాత్మా బసవేశ్వర కృషిచేశారని సికింద్రాబాద్ వీరశైవ సమాజ్ అధ్యక్షుడు మాడపు వీరమల్లేష్, ప్రధాన కార్యదర్శి కోట కొండప్ప పేర్కొన్నారు. కర్ణాటకలో అనుభవ మండపం నిర్మించి అన్ని వర్గాల సమస్యల పరిష్కారం కోసం కృషి చేసినట్లు తెలిపారు. అనుభవ మండప స్ఫూర్తితో భారత పార్లమెంట్ భవన నిర్మాణం జరిగిందన్నారు. మహాత్మా బసవేశ్వర 891వ జయంతిని పురస్కరించుకొని సికింద్రాబాద్ వీరశైవ సమాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం ట్యాంక్‌బండ్‌పై ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వీరశైవలింగాయత్‌లు ఐకమత్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలని కోరారు. కార్యక్రమంలో దైవజ్ఞశర్మ, ఆర్. విశ్వేశ్వరయ్య, బద్రి ఈశ్వరప్ప, హనుమంతు, గౌరీశంకర్, శివకుమార్, లింగం తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్‌లో..

ముషీరాబాద్: వీరశైవ లింగాయత్ సమాజం ముషీరాబాద్ ఆధ్వర్యంలో శుక్రవారం విశ్వగురువు మహాత్మా బసవేశ్వర జయంతిని ముషీరాబాద్ చౌరస్తాలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న బీఆర్‌ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎడ్ల హరిబాబు యాదవ్, జంగమ సమాజం రాష్ట్ర అధ్యక్షుడు విశ్వేశ్వరయ్య, ముషీరాబాద్ అధ్యక్షుడు గౌరీశంకర్, ప్రధాన కార్యదర్శి వీరేంధర్ బసవేశ్వర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజ శ్రేయస్సు, పేదల సంక్షేమం కోసం బసవేశ్వర కృషిచేశారని కొనియాడారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా నేటి పాలకులు ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ సమాజం ఉపాధ్యక్షులు కల్యాణ్, శివకుమార్, మల్లేష్, కోశాధికారి అశోక్, కార్యదర్శి వీరేశం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



బీజేపీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఎంపీ డాక్టర్ లక్ష్మణ్

బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు బీజేపీలో చేరిక

కవాడిగూడ, మే 10 (ఆంధ్రజ్యోతి): రోటరీ కాలనీ బస్తీ అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు బండారి యాదగిరితోపాటు సుమారు వందమంది కవాడిగూడ కార్పొరేటర్ జి. రచనశ్రీ, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు ఎంసీ మహేందర్‌బాబు ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. వారికి ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ టి. రవీందర్, బీజేపీ నాయకులు పూస రాజు, సలంద్రి శ్రీనివాస్ యాదవ్, రమేష్‌రాం తదితరులు పాల్గొన్నారు.

'ఒత్తిడి లేకుండా సివిల్స్ పరీక్షలు రాయాలి'

చిక్కడపల్లి, మే 10 (ఆంధ్రజ్యోతి): సివిల్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలని ఐఏఎస్ అధికారి డా. పవన్ దత్తా సూచించారు. శుక్రవారం అశోక్‌నగర్‌లో అమిగోస్ ఐఏఎస్ అకాడమీలో ఉచిత అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ప్రిలిమినరీ, మెయిన్స్, ఇంటర్వ్యూ పరీక్షలకు ఎలా ప్రిపేర్ కావాలి, రోజుకు ఎన్నిగంటలు చదవాలి, రాజకీయ అంశాలు, దేశంలో జరుగుతున్న పలు పరిణామాలు తదితర అంశాలపై అవగాహన కల్పించడంతోపాటు అభ్యర్థుల సందేహాలు తీర్చారు. ప్రణాళికాబద్ధంగా చదివితే సివిల్స్ సాధించడం కష్టం కాదన్నారు. కార్యక్రమంలో అమిగోస్ ఐఏఎస్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ రెడ్డి, చీఫ్ మెంటార్ కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియా కూటమిని గెలిపించాలి : ఆప్

కవాడిగూడ, మే 10 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకికవాదం రక్షణ కోసం మోదీ నియంతృత్వ వారసత్వాన్ని కూలదోసి ఇండియా కూటమిని గెలిపించాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్. దిడ్డి సుధాకర్ కోరారు. బీజేపీ హిందూ మతాన్ని రాజకీయంగా వాడుకుంటుందని విమర్శించారు. కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడం ప్రజాస్వామ్య మనుగడకు నిదర్శనం అని అన్నారు. శుక్రవారం లిబర్టీలోగల ఆప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించండి అని ఆప్ రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. మోదీ ప్రభుత్వం ప్రశ్నించే వారిపై కేసులు పెట్టి జైలుకు పంపిస్తోందని ధ్వజమెత్తారు. సమావేశంలో ఆప్ నాయకులు బుర్ర రాముగౌడ్, హేమ, నర్సింగ్, యమునాగౌడ్, దర్శనం రమేష్, శ్రీనివాస్, ఆజంబేగ్ తదితరులు పాల్గొన్నారు.